
సాక్షి
గుంటూరు
ఆదివారం । 1 । జూన్ । 2025



బేకరీలో అగ్ని ప్రమాదం

నరసరావుపేట టౌన్: షార్ట్ సర్క్యూట్ కారణంగా సాయి అనుష్క బెంగళూరు అయ్యంగారి బేకరీలో శనివారం అగ్నిప్రమాదం జరిగింది. రూ.5 లక్షల మేరకు ఆస్తినష్టం వాటిల్లింది.



సాగర్ నీటిమట్టం

విజయపురి సౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 512.40 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 5,598 క్యూసెక్కులు విడుదలవుతోంది.



పొగాకు వ్యతిరేక దినోత్సవ ర్యాలీ

ఫిరంగిపురం: నుదురుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యసిబ్బంది అవగాహన ర్యాలీ చేపట్టారు.

అతీగతీ లేని కూటమి భృతి

- 20 లక్షల ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులకు టోకరా
- నిరుద్యోగులకు భృతి ఇస్తామంటూ ఎన్నికల్లో ఊదరగొట్టిన కూటమి నేతలు
- ఒక్కొక్కరికీ నెలకు రూ.3 వేల చొప్పున ఇస్తామని హామీ
- ఏడాదిగా ఆశగా ఎదురు చూస్తున్న నిరుద్యోగులు
- చంద్రబాబు బూటకపు హామీలతో మోసపోయిన నిరుద్యోగ యువత
- గుంటూరు జిల్లాలో ఐదు లక్షల మందికిపైగా నిరుద్యోగులు
- ఉద్యోగాల కోసం ఏళ్ల తరబడి కోచింగ్ తీసుకుంటున్న ఆశావహులు
- రూ. వేలల్లో ఫీజులు చెల్లిస్తుండటంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు



కూటమి ఏడాది పాలనలో నిరుద్యోగులకు నిరాశే

నిరుద్యోగులకు మరోసారి చంద్రబాబు వెన్నుపోటు పొడిచారు. ఎన్నికల వేళ అడ్డగోలుగా హామీలిచ్చి నేడు అమలు చేయడానికి ఆదాయం లేదని మొసలి కన్నీరు కారుస్తున్నారు. 20 లక్షల ఉద్యోగాల కల్పన లేదా అప్పటి వరకు నెలకు రూ.3వేల చొప్పున నిరుద్యోగ భృతి అంటూ సూపర్‌సిక్స్‌లో చేసిన వాగ్దానం నీటిపై రాతలా మారింది. ఉద్యోగం కోసం ఆశగా ఎదురుచూస్తున్న వారు నోటిఫికేషన్లు రాక ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోచింగ్‌లకు రూ.వేలల్లో నెలకు ఖర్చు అవుతుండగా.. కనీసం భృతి కింద సాయం అందడం లేదు. చంద్రబాబు హామీ ఇస్తే నమ్మి మోసపోవడం ఖాయం అనడానికి ఇదే మరో నిదర్శనమని యువత పేర్కొంటున్నారు.

గుంటూరు ఎడ్యుకేషన్: ఎన్నికల వేళ నోటికొచ్చినట్లు హామీలు గుప్పించిన చంద్రబాబు.. నిరుద్యోగ భృతికి ఎగనామం పెట్టి నిరుద్యోగులను నట్టేట ముంచారు. అటు ఉద్యోగాలు లేవు.. ఇటు భృతి కూడా ఇవ్వలేదు. అధికారమే ధ్యేయంగా ఇబ్బడిముబ్బడిగా హామీలు ఇచ్చేసిన చంద్రబాబు.. గద్దెనెక్కాక వాటిని ఎప్పటి మాదిరగానే తుంగలో తొక్కారు. యువతకు లక్షలాది ఉద్యోగాలను కల్పిస్తామని, లేకుంటే ఉద్యోగాలు వచ్చేవరకు నెలకు రూ.మూడు వేలు భృతి ఇస్తామని హామీ ఇచ్చిన ఆయన అధికారం చేపట్టి ఏడాదైనా ఆ ఊసే ఎత్తడం లేదు. ఇంటికో ఉద్యోగం అంటూ చేసిన హడావుడి అంతా ఇంతా కాదు. ఈ ఏడాది కాలంలో ఒక్క డీఎస్సీ నోటిఫికేషన్ మినహా మిగతావేవీ విడుదల చేయలేదు. గ్రూప్–2, కానిస్టేబుల్ ఉద్యోగాలకు నోటిఫికేషన్లు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే ఇచ్చింది.

కోచింగ్‌తో తప్పని ఆర్థిక భారం

టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎన్నికల మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్‌లో యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పన లేదా నెలకు రూ.మూడు వేల భృతి హామీ ప్రధానమైనది. దీనిని అమలు చేసే దిశగా ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు. మరో వైపు ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇవ్వలేదు. డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చినప్పటికీ ఉపాధ్యాయ కొలువులకు విధించిన కఠిన నిబంధనలతో నిరుద్యోగులకు క్లిష్ట పరిస్థితులు ఎదురవుతున్నాయి. గుంటూరు నగరంలోని వివిధ కోచింగ్ సెంటర్లలో ప్రస్తుతం డీఎస్సీ శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. జూన్ 6వ తేదీ నుంచి పరీక్షలు జరగనున్నాయి. డీఎస్సీతోపాటు వివిధ ప్రభుత్వ, బ్యాంకు, పోలీసు కానిస్టేబుల్, ఏపీపీఎస్సీ ఉద్యోగాల కోసం ఉద్యోగార్థులు ప్రతినెలా రూ.వేలల్లో వెచ్చిస్తున్నారు. సొంత ఊళ్ల నుంచి వచ్చి ఇక్కడ శిక్షణ తీసుకోవడం నిరుద్యోగులకు తలకు మించిన భారంగా మారింది. స్టడీ సర్కిళ్లతో పాటు కోచింగ్ సెంటర్లు, లైబ్రరీల్లో ప్రస్తుతం పెద్ద సంఖ్యలో నిరుద్యోగులు పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతున్నారు. గుంటూరు జిల్లాలో ఐదు లక్షల మందికిపైగా నిరుద్యోగులు ఉన్నారు. వీరికి కూటమి ప్రభుత్వ హామీ ప్రకారం నెలకు రూ.మూడు వేలు చొప్పున నిరుద్యోగ భృతి ఇవ్వాల్సి ఉంది. ఇకనైనా చంద్రబాబు తీరు మార్చుకుని తమకు భృతి ఇవ్వాలని వారు కోరుతున్నారు.



సూపర్-6 హామీల్లో మొట్టమొదటి ప్రాధాన్యతగా ఉన్న 20 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి

ఏడాదిగా కూటమి సర్కారు దగా



నిరుద్యోగ భృతి పేరుతో కూటమి ప్రభుత్వం ఏడాదిగా నిరుద్యోగులను మోసగిస్తోంది. దీనిపై తక్షణమే మార్గదర్శకాలు విడుదల చేసి, విద్యావంతులైన నిరుద్యోగులందరికీ భృతి మంజూరు చేయాలి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విడుదల చేసిన ఏకైక నోటిఫికేషన్ డీఎస్సీకి నిర్ణయించిన అర్హతలు ఉద్యోగార్థులను ఆందోళనకు గురి చేశాయి. డిగ్రీలో 50 శాతం మార్కులు ఉన్నవారే దరఖాస్తు చేసేందుకు అర్హులని నిబంధన విధించి ఎంతో మంది ఆశలపై నీళ్లు చల్లారు. ప్రభుత్వ ఉద్యోగాలకు ఏళ్ల తరబడి సన్నద్ధం అవుతున్న నిరుద్యోగ యువత ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతోంది. కోచింగ్‌కు రూ.వేల ఫీజులు చెల్లించిన యువతను నిరుద్యోగ భృతితో ఆదుకోవాలి.

– కేవీ సుబ్రహ్మణ్యం, నిరుద్యోగ ఐక్య వేదిక రాష్ట్ర కన్వీనర్, గుంటూరు

నిరుద్యోగులను మోసగించి వేడుకలు



నిరుద్యోగ యువతకు 20 లక్షల ఉద్యోగాలు, లేదంటే నిరుద్యోగ భృతి అని హామీ ఇచ్చిన చంద్రబాబు వారిని మోసగించారు. ఏడాదైనా అమలు చేయకుండా ఎంతో గొప్పగా మహానాడు జరుపుకొన్నారు. జాబ్ క్యాలండర్ ప్రకటించి ప్రతి ఏడాది దాని ప్రకారం నోటిఫికేషన్లు ఇస్తామని చెప్పిన హామీ ఏమైంది? సంపద సృష్టించి, సంక్షేమ పథకాలు అమలు చేస్తానని చెప్పి రాష్ట్రంలో కొత్తగా ఒక్కటంటే ఒక్క పరిశ్రమను కూడా తీసుకురాలేకపోయారు. నిరుద్యోగ భృతి, ఉద్యోగ నోటిఫికేషన్లు వంటి హామీలు కేవలం ఓట్ల కోసమే ఇచ్చారు. ఆచరణలో నిర్లక్ష్యం కనిపిస్తోంది.

– బందెల నాసర్‌జీ, ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, గుంటూరు

న్యూస్‌రీల్

అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ



ఫిరంగిపురం: మేరికపూడి గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో విగ్రహం దెబ్బతినడంతో దానిని ఇటీవల తొలగించారు. నూతన విగ్రహాన్ని శనివారం ఉదయం 8.12 గంటలకు పునఃప్రతిష్ఠ చేశారు. ఉదయాన్నే వేద పండితుల ఆధ్వర్యంలో మండపారాధన, పంచగవ్య పూజ, పుణ్యాహవచనం, విశేష అర్చనలు నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాగశాలలో హోమాలు జరిగాయి. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమాలను ఈవో జె.శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు పర్యవేక్షించారు.

ఆలయ నిర్మాణానికి రూ.1,01,116 విరాళం



నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెంలోని మహంకాళి అమ్మవారి ఆలయ నిర్మాణానికి పట్టణానికి చెందిన భవానీ సర్జికల్స్ అధినేత బత్తుల వెంకటేశ్వర్లు, శ్రీలక్ష్మి దంపతులు వారి కుమారుడు నితిన్ వెంకట్‌తో కలిసి రూ.1,01,116 విరాళంగా అందజేశారు. ఆలయ కార్యాలయంలో శనివారం విరాళం చెక్‌ను ఆలయ ఈవో నలబోతు మాధవీదేవికి అందించారు. కొత్తలంక కార్తికేయశర్మ, నండూరి కాళికృష్ణలు పాల్గొన్నారు.

సబ్ జైలులో ఆహార పదార్థాల పరిశీలన



సత్తెనపల్లి: పట్టణంలోని సబ్ జైలును మండల న్యాయసేవాధికార కమిటీ చైర్మన్, సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వి.విజయ్‌కుమార్‌రెడ్డి శనివారం సందర్శించారు. ముందుగా సబ్ జైలు పరిసరాలను పరిశీలించారు. రిమాండ్ ఖైదీలకు అందుతున్న ఆహార పదార్థాలను, వాటి నాణ్యతను తెలుసుకున్నారు. ముడి సరకులను పరిశీలించారు. నిందితులు అందరికీ బెయిల్ మంజూరు అయ్యిందా, ఎన్ని రోజులుగా రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు, 70 సంవత్సరాలు వయస్సు ఉన్న వారు ఎవరైనా ఉన్నారా? వంటి విషయాలు ఆరా తీశారు. కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాది బీఎల్. కోటేశ్వరరావు, పారా లీగల్ వలంటీర్ షేక్ సుభాని, సబ్‌జైలు సూపరింటెండెంట్ వెంకటరత్నం తదితరులు ఉన్నారు.

వైన్ షాపులపై ఎక్సైజ్ అధికారుల దాడులు

- నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరిక
- ఓ మద్యం దుకాణంపై కేసు నమోదు



సాక్షి ఎఫెక్ట్

నరసరావుపేట టౌన్: మద్యం దుకాణాల నిర్వాహకులు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ సోమయ్య హెచ్చరించారు. 'బాలలకు విచ్చలవిడిగా మద్యం సరఫరా' అనే శీర్షికతో సాక్షిలో శనివారం ప్రచురితమైన కథనంపై ఎక్సైజ్ అధికారులు పట్టణంలోని వైన్స్‌లపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా రావిపాడు రోడ్డులో నిబంధనలు అతిక్రమించిన ఓ వైన్స్‌పై కేసు నమోదు చేశారు. మైనరులకు మద్యం విక్రయించినా, వైన్స్‌ల్లో అనధికారంగా సిటింగ్ ఏర్పాటు చేసి మద్యం సరఫరా చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే మద్యం దుకాణాల లైసెన్స్‌ల రద్దుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ముఖేష్ గురి.. పతకమే మరి!

- రైఫిల్ షూటింగ్‌లో రాణిస్తున్న ముఖేష్ నేలవల్లి
- రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ అరుదైన ఘనత
- జూనియర్ వరల్డ్ కప్ రైఫిల్ షూటింగ్ పోటీల్లో కాంస్యం
- ఒలింపిక్స్‌లో పతకమే లక్ష్యంగా కఠోర సాధన

SUNDAY SPECIAL

గుంటూరు వెస్ట్ (క్రీడలు): కొన్ని అనుకోని సంఘటనలు జీవితాన్ని మలుపు తిప్పుతాయనడంలో అతిశయోక్తి లేదు. అవి కొందరిని హీరోలుగా మారిస్తే.. మరి కొందర్ని జీరోలను చేస్తాయి. గుంటూరుకు చెందిన ముఖేష్ నేలవల్లికి మాత్రం ఆదర్శవంతమైన జీవిత మార్గాన్ని నిర్దేశించాయి. రెప్పపాటులో విజయం, వెంట్రుక వాసిలో పతకాలు చేజారిపోయే రైఫిల్ షూటింగ్‌లో అద్భుత ప్రతిభ కనబరుస్తున్నాడు. ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాల్లో జూనియర్ రైఫిల్ విభాగంలో పలు ఘనతలను సాధిస్తున్నాడు.

గత ఏడాది పెరూలో జరిగిన వరల్డ్ జూనియర్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో మొత్తం 5 బంగారు, 2 కాంస్య పతకాలు సాధించి రికార్డు సృష్టించాడు. ఈ నెల 17 నుంచి 26వ తేదీ వరకు జర్మనీలో జరిగిన జూనియర్ వరల్డ్ కప్ రైఫిల్ షూటింగ్ పోటీల్లో 25 మీటర్ల ర్యాపిడ్ షూటింగ్‌లో కాంస్య పతకం సాధించాడు. వచ్చే నెల 4వ తేదీ నుంచి డెహ్రాడూన్‌లో జరగనున్న ఏషియన్ రైఫిల్ షూటింగ్ చాంపియన్‌షిప్ ఎంపిక పోటీలకు సిద్ధమవుతున్నాడు.

భారత జట్టులో స్థానం

రైఫిల్ షూటింగ్‌లో జాతీయ స్థాయిలో ఎంపిక కావడమే కష్టం. కానీ 10 మీటర్ల ఎయిర్ పిస్టల్, 25 మీటర్ల స్పోర్ట్స్ పిస్టల్, రాపిడ్ ఫైర్ పిస్టల్, స్టాండర్డ్ పిస్టల్, 50 మీటర్ల ఫ్రీ పిస్టల్‌లో ముఖేష్ నిలకడగా రాణిస్తున్నాడు. ఈ క్రమంలో జాతీయ పోటీల్లో 80కుపైగా పతకాలు సాధించాడు. వీటిలో 70 శాతానికి పైగా బంగారు పతకాలే కావడం గమనార్హం. ఇప్పటి వరకు ఏ పోటీలోనూ పతకం సాధించకుండా రాలేదంటే అతిశయోక్తి కాదు. ఈ క్రమంలో భారత రైఫిల్ షూటింగ్ క్యాంపునకు ఎంపికయ్యాడు.



ముఖేష్ విజయ దరహాసం

అనుకోకుండా సమ్మర్ క్యాంపులో..

అది 2016వ సంవత్సరం. కేవలం 11 ఏళ్ల వయస్సులో స్కూల్ నిర్వహించే సమ్మర్ క్యాంపులో బాస్కెట్ బాల్ సాధన కోసం ముఖేష్ చేరాడు. కోచ్ సూచనతో అనుకోని విధంగా రైఫిల్ షూటింగ్ శిక్షణలో సోదరుడు హితేష్‌తో కలిసి సాధన ప్రారంభించాడు. కొద్ది రోజులకే పతకాలు సాధించడంతో ముఖేష్‌తోపాటు కుటుంబ సభ్యులకు నమ్మకం కలిగింది. ఈ క్రమంలో తండ్రి శ్రీనివాసరావు 2018లో స్థానికంగా అందుబాటులో ఉన్న ఇండియన్ అకాడమీ ఆఫ్ షూటింగ్ స్పోర్ట్స్ చీఫ్ కోచ్ నగిశెట్టి సుబ్రమణ్యం వద్దకు 10 మీటర్ల షూటింగ్ శిక్షణలో చేర్పించారు. తర్వాత ముఖేష్ ఏ జాతీయ పోటీలకు వెళ్లినా పతకాలు సాధించడం పరిపాటిగా మారింది.

దశ మార్చిన గగన్ నారంగ్ అకాడమీ

ఆ తర్వాత 25, 50 మీటర్ల షూటింగ్ సాధన కోసం గుంటూరు నుంచి పూణెలోని ఒలింపిక్స్ రజత పతక గ్రహీత గగన్ నారంగ్ నిర్వహించే గన్ ఫర్ గ్లోరీ షూటింగ్ అకాడమీలో చేరాడు. ముఖేష్‌లోని ఏకాగ్రతకు అకాడమీ చీఫ్ కోచ్ ఒలింపియన్ సీకే చౌదరి ముగ్ధుడయ్యారు. తక్కువ కాలంలోనే ముఖేష్ భారత జూనియర్ జట్టుకు ఎంపికయ్యాడు. సీకే చౌదరితో పాటు జర్మన్ కోచ్ ఓయే నెప్ శిక్షణ అంతర్జాతీయ షూటర్‌గా గుర్తింపు తెచ్చింది

త్యాగాలు తప్పవు

ముఖేష్ తండ్రి శ్రీనివాసరావు గుంటూరులో సీనియర్ న్యాయవాదిగా, తల్లి మాధవి పులివర్తి ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. ముఖేష్ కోసం వీరిద్దరూ ఎంతో కష్టపడ్డారు. అతను కూడా తల్లిదండ్రుల కష్టాన్ని చూసి ఎన్నో సంతోషాలను దూరం చేసుకున్నాడు. అనుక్షణం సాధన, పతకాలు, కెరీర్‌పైనే దృష్టి సారించాడు. రోజుకు 10 గంటలకుపైగానే సాధన చేయాల్సిన రోజులు కూడా ఉన్నాయి. ముఖేష్ క్రీడల్లోనే కాకుండా చదువులోనూ రాణిస్తున్నాడు. కేఎల్ యూనివర్సిటీలో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. రెండింటిని ముందుకు నడిపించడం కొంచెం కష్టమైనా సమయాన్ని వృథా చేయకుండా ముందుకు సాగుతున్నాడు.



ఏషియన్ రైఫిల్ షూటింగ్ పోటీల కోసం సాధన చేస్తున్న ముఖేష్

ఒలింపిక్స్ పతకమే లక్ష్యం



భారత జట్టు తరఫున సీనియర్ విభాగంలో ఒలింపిక్స్‌లో పతకం సాధించడమే లక్ష్యంగా నా సాధన కొనసాగుతోంది. ఆటతీరు ఎప్పటికప్పుడు మెరుగుపరచడంలో కోచ్‌ల పాత్ర ఎంతో ఉంది. దీంతోపాటు కుటుంబ సభ్యులు అనుక్షణం వెన్నంటే ఉండి ముందుకు నడిపిస్తున్నారు. అందుకే తక్కువ సమయంలోనే ఈ స్థాయికి వచ్చాను. త్వరలోనే సీనియర్ విభాగంలోనూ పోటీ పడతాను. ఆగస్టులో జరగనున్న ఏషియన్ రైఫిల్ షూటింగ్‌లో పతకం సాధించడానికి సాధన చేస్తున్నా.

– ముఖేష్ నేలవల్లి, ఇంటర్నేషనల్ రైఫిల్ షూటర్

4న వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేద్దాం



వెన్నుపోటు దినం వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- అధికారం కోసం బాబు చేసిన మోసాన్ని ప్రజలకు చెబుదాం
- సంవత్సరం గడిచినా హామీల అమలులో ప్రభుత్వం విఫలం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు

నెహ్రూనగర్: కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాదైనా ఇచ్చిన హామీలను నెరవేర్చకపోగా.. ప్రజలను చంద్రబాబు అన్ని రకాలుగా మోసం చేశారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు జూన్ 4న జరిగే వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేసే క్రమంలో భాగంగా శనివారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ సన్నాహక సమావేశంలో పార్టీ గుంటూరు పార్లమెంట్ పరిశీలకులు పోతిన మహేష్, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, చంద్రగిరి ఏసురత్నం, నగర అధ్యక్షురాలు నూరి ఫాతిమా, మంగళగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి దొంతిరెడ్డి వేమారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంబటి రాంబాబు మాట్లాడుతూ.. చంద్రబాబు మోసాన్ని ప్రజలను వివరించేందుకు అధినేత వైఎస్ జగన్ ఆదేశాల మేరకు జిల్లాలోని 7 నియోజకవర్గాల్లో వెన్నుపోటు దినాన్ని ప్రజల భాగస్వామ్యంతో భారీగా నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. మహానాడులో చంద్రబాబు ప్రసంగిస్తూ వచ్చే సంవత్సరం నుంచి హామీలను అమలు చేస్తామని మరోసారి మోసం చేసేందుకు యత్నిస్తున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ సూపర్ సిక్స్‌తోపాటు 143 ఇతర హామీలను ఇచ్చి ప్రజలను చంద్రబాబు దారుణంగా మోసం చేశారన్నారు. వెన్నుపోటు దినంతో వైఎస్సార్‌సీపీ చరిత్ర సృష్టించనుందని చెప్పారు. పోతిన మహేష్ మాట్లాడుతూ ప్రజలను మభ్యపెట్టి మోసం చేసిన వైనాన్ని చెప్పేందుకు వెన్నుపోటు దినాన్ని నిర్వహిస్తామన్నారు. అన్ని వర్గాలను చంద్రబాబు మోసం చేశారన్నారు. ఏడాదికి కొన్ని రూ. లక్షల కోట్లు ఎలా ఖర్చు పెట్టారో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. అక్రమ కేసులు, కక్ష సాధింపు చర్యలపై కాకుండా పరిపాలనపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. రాష్ట్రంలో ఆడబిడ్డలకు రక్షణ లేదన్నారు. బాత్ రూంలో సీసీ కెమెరాలు పెట్టినా, హనుమాన్ జయంతిలో రికార్డింగ్ డ్యాన్స్‌లు వేస్తున్నా, మంగళగిరిలో హత్య జరిగినా స్పందించని లోకేష్ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. పదో తరగతి విద్యార్థుల జీవితాలను ప్రభుత్వం నాశనం చేసిందని మండిపడ్డారు. ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ కూటమి పలు హామీలు ఇచ్చి ఒక్కటీ అమలు చేయలేదన్నారు. ఉన్న ఉద్యోగాలు ఊడగొట్టారన్నారు. పార్టీ నగర అధ్యక్షులు షేక్ నూరి ఫాతిమా మాట్లాడుతూ చంద్రబాబు మోసాన్ని గడపగడపకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రాజనారాయణ, వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

యోగాంధ్ర పోటీలకు ఆహ్వానం

నరసరావుపేట: యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా వార్డు, గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి యోగా పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసనాల ప్రదర్శన (సూర్య నమస్కార్ ఛాలెంజ్, ప్రాణాయామం, మెడిటేషన్), ఆర్టిస్టిక్ యోగా (యోగా సాంగ్, యోగా పెయింటింగ్, యోగా స్కిట్, రోల్‌ప్లే), వైజ్ఞానిక యోగా (యోగా క్విజ్, యోగా పోస్టర్, యోగా స్లోగన్, యోగా ఎస్సే), యోగా షార్ట్‌ఫిల్మ్, యోగా ఫొటోగ్రఫీలో పోటీలు జరుగుతాయని తెలిపారు. అలాగే గ్రూప్ విభాగంలో సింక్రనైజ్డ్ గ్రూప్ యోగా, మిక్స్‌డ్ ఏజ్ గ్రూప్ యోగా పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జూనియర్ గ్రూప్ (10–18 ఏళ్లు), యంగ్ గ్రూప్ (19–35 ఏళ్లు), సీనియర్ గ్రూప్ (35 ఏళ్లు, ఆపైన) కేటగిరీల్లో పోటీలు జరుగుతాయన్నారు. వివరాలకు 94406 11107 నంబరులో సంప్రదించవచ్చని సూచించారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శనివారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **2,100** గరిష్ఠం : రూ. **3,400**

మోడల్ ధర రూ. **2,600**

క్లుప్తంగా

పొగాకు వాడకంతో అనర్థాలు



గుంటూరు మెడికల్: పొగాకు వాడకం ఎన్నో అనర్థాలకు దారి తీస్తుందని, పొగాకు ఏరూపంలో తీసుకున్నా ప్రాణాంతకమైన జబ్బులు వస్తాయని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి అన్నారు. శనివారం నో టుబాకో డే సందర్భంగా డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో అవగాహన ర్యాలీ జరిగింది. సిబార్ డెంటల్ కాలేజ్ విద్యార్థులు, ఆశ కార్యకర్తలతో పొగాకు వ్యతిరేక దినం గురించి డీఎంహెచ్‌ఓ ప్రతిజ్ఞ చేయించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పొగాకు వాడకం ప్రాణాంతకమైన వ్యాధికి దారి తీస్తోందన్నారు. యువత ఫ్యాషన్ కోసం పొగతాగడం అలవాటు చేసుకుంటున్నారని, చివరకు దానికి అలవాటు పడి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారన్నారు. తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండి పిల్లల ప్రవర్తనను గమనించాలన్నారు. డీఎంహెచ్‌ఓ కార్యాలయం నుంచి ర్యాలీ ప్రారంభమై, నగరంపాలెం మూడుబొమ్మల సెంటర్ వరకు కొనసాగింది. పొగాకు తాగొద్దు – క్యాన్సర్ వ్యాధికి గురికావద్దు, సిగరెట్ పొగ – జీవితానికి సెగ అంటూ నినాదాలు చేస్తూ వైద్యులు, వైద్య సిబ్బంది ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్‌లు డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు, డాక్టర్ రోహిణి రత్నశ్రీ, డాక్టర్ అన్నపూర్ణ, సిబార్ డెంటల్ కాలేజ్‌కు చెందిన డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ లలిత్, డాక్టర్ గిరిధర్, జయప్రకాష్, జ్యోతి, వెంకటేశ్వర్లు, ఇస్మాయిల్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు చంద్రబాబు వెన్నుపోటు

- జూన్ 4న రాష్ట్రవ్యాప్తంగా వెన్నుపోటు దినం
- వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు
- తాడికొండలో సన్నాహక సమావేశం
- పాల్గొన్న పార్టీ పార్లమెంటు పరిశీలకులు పోతిన మహేష్, మాజీ ఎంపీ మోదుగుల



వెన్నుపోటు దినోత్సవం పోస్టరు ఆవిష్కరిస్తున్న అంబటి, మోదుగుల, పోతిన మహేష్, పలు నియోజకవర్గాల ఇన్‌ఛార్జిలు

తాడికొండ: సూపర్ సిక్స్ హామీలు ఎగ్గొట్టిన చంద్రబాబు రాష్ట్ర ప్రజలను వెన్నుపోటు పొడిచారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు అంబటి రాంబాబు అన్నారు. శనివారం సాయంత్రం తాడికొండలోని షిర్డీసాయి బాబా ఆలయ కల్యాణ మండపంలో నిర్వహించిన వెన్నుపోటు దినోత్సవ సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అధికారం కోసం సూపర్ సిక్స్ పేరుతో హామీలిచ్చిన చంద్రబాబు ఒక్క హామీని కూడా నెరవేర్చలేకపోవడం మోసం చేయడం కాదా అని ప్రశ్నించారు. మహిళలకు ఉచిత బస్సు, విద్యార్థులకు తల్లికి వందనం, రైతు భరోసా ఈ పథకాలన్నీ ఏడాదైనా ఎందుకు అమలు చేయకుండా ప్రజలను వెన్నుపోటు పొడిచావో ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. రాజధాని పేరుతో గతంలో 55 వేల ఎకరాలను తీసుకున్న చంద్రబాబు ఆ రైతులకు న్యాయం చేయకుండా ఇప్పుడు మరో 45 వేల ఎకరాలు కావాలనడంపై రాజధాని ప్రాంత ప్రజలు పూర్తిగా వ్యతిరేకిస్తున్నారన్నారు. బాబు చేసిన మోసాలను ప్రజలకు వివరించేలా ఈనెల 4న రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు నిర్వహించే వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు, మోసపోయిన ప్రజలు పెద్ద ఎత్తున హాజరై నియోజకవర్గ కేంద్రాల్లో తహసీల్దార్‌లకు వినతిపత్రాలు అందజేయాలని ఆయన పిలుపునిచ్చారు.

చంద్రబాబుకు అబద్ధాలు అలవాటే..

మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబుకు మొదటి నుంచి అబద్ధాలు చెప్పి అధికారంలోకి రావడం అలవాటుగా మారిందని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అబద్ధాలు ఆడే అలవాటు లేనందునే గత ఎన్నికల్లో ఓటమి పాలయ్యాడన్నారు. చంద్రబాబు సంక్షేమం గాలికొదిలి వైఎస్సార్ సీపీ నాయకులను అరెస్టులు చేసి జైల్లో పెట్టి భయభ్రాంతులకు గురిచేసి మళ్లీ గెలవాలని ప్రయత్నిస్తున్నాడని, ఏ ఒక్కరూ భయపడొద్దన్నారు. కంతేరులో దళిత ఎంపీటీసీని నైటీపై అర్ధరాత్రి అరెస్టు చేయడం సభ్య సమాజానికి ఏం సందేశం ఇస్తారని హెచ్చరించారు. కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని, నియోజకవర్గ ఇన్‌ఛార్జి డైమండ్ బాబు పార్టీ కోసం కష్టపడి పనిచేస్తున్నాడని ఏ ఒక్కరూ భయపడాల్సిన అవసరం లేదన్నారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వనమా బాల వజ్ర బాబు(డైమండ్), మంగళగిరి, పొన్నూరు, గుంటూరు తూర్పు నియోజకవర్గాల ఇన్‌ఛార్జిలు దొంతిరెడ్డి వేమారెడ్డి, అంబటి మురళి, షేక్ నూరి ఫాతిమా, రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి కల్లం హరికృష్ణారెడ్డి, 4 మండలాల పార్టీ అధ్యక్షులు ముప్పాళ్ళ మనోహర్, మైనేని నాగమల్లేశ్వరరావు, తాళ్ళూరి వంశీ, మార్పుల శివరామిరెడ్డి, తాడికొండ వైస్ ఎంపీపీ, నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు రెడ్డి త్రివేణి, జిల్లా పంచాయతీ రాజ్ విభాగం అధ్యక్షులు దాసరి రాజు, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షులు చుండు వెంకటరెడ్డి, నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షులు మల్లంపాటి రాఘవరెడ్డి, గ్రామపార్టీ అధ్యక్షులు వంగా పోలారెడ్డి, చేవూరి రామ్మోహన్ రెడ్డి, దాసరి మిల్కియా, బత్తుల కిషోర్ పలువురు వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాయ మాటలతో అధికారంలోకి..

గుంటూరు పార్లమెంటు ఎన్నికల పరిశీలకులు పోతిన మహేష్ మాట్లాడుతూ దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని సంక్షేమం, అభివృద్ధి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో జరిగిందన్నారు. మాయ మాటలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఒక్క హామీని కూడా అమలు చేయకుండా కోట్లాది మంది ప్రజలను వెన్నుపోటు పొడిచారన్నారు. తనను పవన్ కల్యాణ్ మోసం చేస్తే వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అక్కున చేర్చుకొని ఇంత పెద్ద బాధ్యత అప్పగించారని కృతజ్ఞతలు తెలిపారు.

నేడు వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం

పొన్నూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గ విస్తత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జూన్ 4న నిర్వహించనున్న వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని ఉద్దేశించి నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేయనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమయ్యే సమావేశంలో వైఎస్సార్ సీపీ గుంటూరు పార్లమెంటు నియోజకవర్గం పరిశీలకుడు పోతిన మహేష్, జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, పలు నియోజకవర్గాల పార్టీ సమన్వయకర్తలు షేక్ నూరి ఫాతిమా, డైమండ్ బాబు, దొంతిరెడ్డి వేమారెడ్డి, అన్నాబత్తిని శివకుమార్, బలసాని కిరణ్ కుమార్, అనుబంధ విభాగాల జిల్లా అధ్యక్షులు పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో నియోజకవర్గంలోని జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ పార్టీ పదవుల్లో ఉన్న నాయకులు, కార్యకర్తలు అందరూ పాల్గొనాలని కోరారు.

నేడు వెన్నుపోటు దినం పోస్టర్ ఆవిష్కరణ

మంగళగిరి టౌన్: కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది పూర్తయినా నేటి వరకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను చేస్తున్న మోసాలను గుర్తుచేస్తూ వైఎస్సార్ సీపీ ఆదేశాల మేరకు జూన్ 4వ తేదీన వెన్నుపోటు దినం నిర్వహిస్తున్నట్లు మంగళగిరి నియోజకవర్గ సమన్వయ కర్త దొంతిరెడ్డి వేమారెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో భాగంగా పార్టీ మంగళగిరి నియోజకవర్గ కార్యాలయంలో ఆదివారం ఉదయం 10 గంటలకు వెన్నుపోటు దినం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్నట్లు ఆయన అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో మాజీ చైర్మన్ చిల్లపల్లి మోహనరావు పాల్గొంటారని, నియోజకవర్గ పరిధిలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

బదిలీలు, ఉద్యోగోన్నతుల్లో సమస్యలు పరిష్కరించాలి

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ బదిలీలు, ఉద్యోగోన్నతుల్లో సమస్యలు పరిష్కరించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.బసవలింగారావు, ఎండీ ఖాలీద్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈమేరకు పాఠశాల విద్య ఆర్జేడీ బి.లింగేశ్వరరెడ్డి, డీఈఓ సీవీ రేణుక దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. అన్ని కేడర్లలో తాత్కాలిక సీనియార్టీ జాబితాల్లో ఏర్పడిన ఇబ్బందులపై అభ్యంతరాలను పరిగణలోకి తీసుకుని, తుది సీనియార్టీ జాబితాలను వెబ్ ఆప్షన్లకు ముందే విడుదల చేయాలని కోరారు. వెబ్ ఆప్షన్లు కౌన్సెలింగ్‌కు ముందుగానే తుది ఖాళీల జాబితాలను హెచ్ఆర్‌ఏ కేటగిరితో విడుదల చేయడంతో పాటు ప్రైమరీ స్కూల్ హెచ్ఎం పోస్టులకు కౌన్సెలింగ్ మాన్యువల్ విధానంలో జరపాలన్నారు. ఆయా ఖాళీల భర్తీ తరువాతే స్కూల్ అసిస్టెంట్ల బదిలీలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ–2014, 2012 తదితర డీఎస్సీల ద్వారా నియమితులైన ఉపాధ్యాయుల బదిలీల్లో సీనియార్టీ జాబితాలను మెరిట్ కం రోస్టర్ ఆధారంగా తయారు చేయాలని, పుట్టిన తేదీ ఆధారంగా కాదన్నారు.

బదిలీల్లో ఉపాధ్యాయులకు తిప్పలు..

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యాశాఖ ప్రకటించిన ఉపాధ్యాయ బదిలీల షెడ్యూల్‌ను ముందుకు జరిపి, త్వరితగతిన పూర్తి చేయాలనే యత్నంలో హడావుడిగా తీసుకున్న నిర్ణయాలతో స్పష్టత లేకపోవడంతో ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖర్‌రావు, ఎం.కళాధర్ శనివారం ఓప్రకటనలో తెలిపారు. విద్యాశాఖ ఆదేశాల మేరకు హైస్కూళ్లలోని స్కూల్ అసిస్టెంట్లు ప్రాథమిక పాఠశాలల హెచ్ఎంలుగా బదిలీకి ఆప్షన్లు నమోదు చేసుకునేందుకు అవకాశం ఇచ్చారని తెలిపారు. అయితే శనివారం సాయంత్రం వరకే అవకాశం ఇవ్వడంతో ఆన్‌లైన్‌లో నిర్ణీత ఫార్మేట్ లేకపోవడం, జాబితాలు సక్రమంగా డిస్‌ప్లే కాకపోవడంతో ఉపాధ్యాయులు ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు.తరచూ ఇదేవిధంగా సాంకేతిక సమస్యలు ఎదురు కావడం, పరిష్కరించేందుకు విద్యాశాఖాధికారుల దగ్గరకు పరుగులు తీయడం వంటి సంఘటనలతో గందరగోళంగా మారిందన్నారు.

ఏ నిబంధనల ప్రకారం కొట్టారు ?

- తెనాలి పోలీసులపై తక్షణమే చర్యలు తీసుకోవాలి
- కమ్యూనిస్టు ఇండియా జాతీయ కార్యదర్శి తోట నంగమేశ్వరరావు

లక్ష్మీపురం: ఏ నిబంధన ప్రకారం తెనాలిలో యువకులను నడిరోడ్డుపై పోలీసులు కొట్టారో చెప్పాలని అలా కొట్టడం పోలీస్ మాన్యువల్‌కు విరుద్ధమా కాదా అని కమ్యూనిస్టు ఇండియా జాతీయ కార్యదర్శి తోట సంగమేశ్వరరావు(సంగమ్) శనివారం ఓ ప్రకటనలో ప్రశ్నించారు. మ్యాన్యువల్‌ను ఉల్లంఘించిన పోలీసులు నేరస్తులు అవుతారని ఆ పోలీసులను తక్షణం ఉద్యోగం నుంచి తొలగించి రిటైర్మెంట్ బెనిఫిట్స్ రాకుండా నిలిపివేసి, కేసు నమోదు చేసి కోర్టులో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు.

మహిళపై లైంగికదాడికి యత్నం

అడిగేందుకు వెళ్లిన కుటుంబ సభ్యులపై కారం చల్లి దాడి

తాడేపల్లి రూరల్: గుంటూరు జిల్లా మంగళగిరి నియోజకవర్గం తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరంలో దారుణం చోటుచేసుకుంది. ఇద్దరు చిన్నారులతో ఉన్న ఓ మహిళపై స్థానికంగా నివాసముండే ఓ యువకుడు లైంగికదాడికి యత్నించాడు. ఆ మహిళ పెద్దగా కేకలు వేయడంతో అక్కడి నుంచి పరారయ్యాడు. సేకరించిన వివరాల ప్రకారం.. స్థానికంగా ఓ ఆటోడ్రైవర్ తన భార్య, ఇద్దరు పిల్లలతో నివాసం ఉంటాడు. అతని ఇంటి ఎదురుగా శివ అనే వ్యక్తి నివాసముంటున్నాడు. శివ ఆటోడ్రైవర్ భార్యను తరచూ లైంగికంగా వేధించసాగాడు. ఈక్రమంలో శనివారం మధ్యాహ్నం సమయంలో బాధితురాలు తన ఇద్దరు పిల్లలతో కలిసి తన ఇంట్లో నిద్రిస్తుండగా, శివ ఇంట్లోకి చొరబడి బాధితురాలిపై లైంగికదాడికి యత్నించాడు. బాధితురాలు కేకలు వెయ్యడంతో నిందితుడు పరారయ్యాడు. ఘర్షణలో బాధిత మహిళకు పలుచోట్ల దుస్తులు చిరగడంతో పాటు, స్వల్ప గాయాలయ్యాయి. జరిగిన విషయాన్ని బాధితురాలు తన భర్తకు, బంధువులకు చెప్పడంతో అందరూ కలిసి శివ ఇంటికి వెళ్లి అడగ్గా, శివ కుటుంబ సభ్యులు వీరిపై గొడవకు దిగి, బాధితురాలి కుటుంబ సభ్యులపై శివ కుటుంబ సభ్యులు కారం చల్లి దాడికి పాల్పడ్డారు. జరిగిన ఘటనపై తాడేపల్లి పోలీసు స్టేషన్‌లో బాధితురాలు ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా దాదాపుగా మూడు గంటల సేపు పోలీసులు తమను బయట నిలబెట్టారని బాధితురాలి బంధువులు తెలిపారు.



వర్షానికి గోడ కూలి యువకుడు మృతి



లక్ష్మీపురం: భారీ వర్షానికి ప్రహరీ కూలి గాయాలపాలైన ఘటనలో చికిత్స పొందుతూ మహిళా ఎస్ఐ కుమారుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు ఏటీ అగ్రహారంకు చెందిన సదాశివరావు, గుంటూరు జిల్లా పీసీఆర్‌లో విధులు నిర్వహిస్తున్న మహిళా ఎస్ఐ రాజరాజేశ్వరిల ఒక్కగానొక్క కుమారుడు పృథ్వీ భూషణ్ (29) విజయవాడలో ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. శుక్రవారం సాయంత్రం 8 గంటల సమయంలో తల్లి రాజరాజేశ్వరి రెండునెలల్లో రిటైర్ కానున్న నేపథ్యంలో రిటైర్‌మెంట్‌కు సంబంధించిన ధ్రువపత్రాలను సంబంధిత అధికారులకు అప్పగించి, అక్కడ నుంచి 10.30 గంటల సమయంలో నవభారత్ నగర్‌లోని మ్యాక్స్ మాల్ ఎదురు గల చికెన్, గుంటపునుగులు విక్రయించే ప్రదేశానికి వచ్చారు. అక్కడున్న స్నేహితుడిని కలిసేందుకు కారులో నుంచి దిగి, చికెన్ విక్రయించే ప్రదేశానికి వెళ్లాడు. అక్కడున్న ఓ గోడకు ఆనుకుని స్నేహితుడితో మాట్లాడుతున్నాడు. వర్షం నీటికి నానిన గోడ హఠాత్తుగా వారిపై పడింది. హుటాహుటిన రాజేశ్వరి తన కుమారుడిని జీజీహెచ్‌కు తరలించారు. వైద్యులు అప్పటికే పృథ్వీ భూషణ్ పరిస్థితి విషమంగా ఉందని చెప్పారు. చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. పట్టాభిపురం ఎస్ఐ నరహరి ఘటన ప్రదేశాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్ట్‌మార్టంకు తరలించి, అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. అయితే ఈ ఘటనలో గాయపడిన మరో ఇద్దరి వివరాలు తెలియాల్సి ఉంది.

దృఢ సంకల్పంతో ముందుకు సాగితే విజయం తథ్యం



మాట్లాడుతున్న ఏసీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ పి.ఆంద్రూస్

- వెనిగండ్ల కౌండిన్య ఐఏఎస్ అకాడమీలో బ్యాంక్ ఉద్యోగాలకు ఉచిత శిక్షణ ప్రారంభం
- నిరుద్యోగ యువతీయువకులు సద్వినియోగం చేసుకోవాలి
- ఆంధ్ర క్రిస్టియన్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ పి.ఆంద్రూస్

పెదకాకాని: ఉద్యోగం సాధించాలనే బలమైన లక్ష్యం కలిగి, దృఢ సంకల్పంతో కృషి చేసిన వారు తప్పక విజయం సాధిస్తారని ఆంధ్ర క్రిస్టియన్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ పి.ఆంద్రూస్ అన్నారు. పెదకాకాని మండలం, వెనిగండ్ల గ్రామ శివారులో గల కౌండిన్య ఐఏఎస్ అకాడమీ భవనంలో బ్యాంకు ఉద్యోగాలకు నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ తరగతుల మూడో బ్యాచ్ ప్రారంభోత్సవ సభలో శనివారం డాక్టర్ ఆంద్రూస్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సభకు కమర్షియల్ ట్యాక్స్ విశ్రాంత కమిషనర్ వై.సత్యనారాయణ అధ్యక్షత వహించారు. డాక్టర్ ఆంద్రూస్ మాట్లాడుతూ శిక్షణా తరగతులకు హాజరైన ప్రతి ఒక్కరూ ఉద్యోగ సాధనే ఏకైక లక్ష్యంగా, ప్రణాళికాబద్ధంగా, క్రమశిక్షణతో పోటీ పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. అలాంటి వారికి ఉద్యోగ సాధన ఏమాత్రం కష్టతరం కాబోదన్నారు. సభలో పాల్గొన్న కౌండిన్య ఐఏఎస్ అకాడమీ వ్యవస్థాపకులు, చైర్మన్ డాక్టర్ ఈవీ నారాయణ మాట్లాడుతూ పేద, మధ్యతరగతి నిరుద్యోగులు ఉన్నత ఉద్యోగాలను సాధించాలనే ఏకైక లక్ష్యంతో ఈ ఉచిత శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. విశేష బోధనా అనుభవం కలిగిన అధ్యాపకులు ఈ శిక్షణా తరగతులలో పాలుపంచుకుంటారన్నారు. ఉద్యోగం సాధించి తీరాలనే ఏకైక లక్ష్యం గలవారే ఈ ఉచిత శిక్షణా తరగతులను వినియోగించుకోవాలన్నారు. మహిళా అభ్యర్థులకు ఉచిత నివాస వసతి కూడా కల్పిస్తున్నామన్నారు.

నాణ్యతా ప్రమాణాల్లో రాజీలేదు..

సభాధ్యక్షుడు వై.సత్యనారాయణ మాట్లాడుతూ కౌండిన్య ఐఏఎస్ అకాడమీ పోటీ పరీక్షల శిక్షణ తరగతుల ప్రమాణాల విషయంలో రాజీ పడబోదన్నారు. తరగతులను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు మాట్లాడుతూ స్పష్టమైన లక్ష్యంతో కృషి చేసే వారు ఏదైనా సాధించగలరన్నారు. సమావేశంలో ఉచిత శిక్షణ తరగతులలో పాల్గొనే అధ్యాపకులు ఇ.కోటేశ్వరరావు, ఇ.అమర్నాథ్, సీహెచ్ఎస్ఎస్ నవీన్, కౌండిన్య ఐఏఎస్ అకాడమీ సభ్యులు వడ్డెంగుంట సుబ్బారావు, పామర్తి సాంబశివరావు, వాకా రాంగోపాల్ గౌడ్, వీరంకి రంగారావు, బొబ్బిళ్ళ వెంకటేశ్వరరావు, డాక్టర్ తాతా సాంబశివరావు, డాక్టర్ టి.సేవకుమార్, నారగాని కృష్ణ, డాక్టర్ లక్ష్మీదేవి, పి.శ్రీనివాసరావు, డాక్టర్ వి.సింగారావు, పి.రామకృష్ణ, టి.ధనుంజయరెడ్డి, శిక్షణా తరగతులకు హాజరయ్యే అభ్యర్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీలో స్థాయీ సంఘాల భేటీ

- కోరం లేక వాయిదా పడిన రెండో స్థాయీ సంఘ సమావేశం
- సమావేశానికి గైర్హాజరైన జెడ్పీ వైస్ చైర్మన్ నర్సిరెడ్డి



స్థాయీ సంఘ సమావేశాన్ని నిర్వహిస్తున్న చైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు శనివారం జెడ్పీలో భేటీ అయ్యాయి. ఏడు స్థాయీ సంఘాలకు రెండవ స్థాయీ సంఘ సమావేశం కోరం లేకపోవడంతో వాయిదా పడింది. అదే విధంగా జెడ్పీ వైస్‌చైర్మన్ శొంటిరెడ్డి నర్సిరెడ్డి అధ్యక్షతన జరగాల్సిన 3వ స్థాయీ సంఘ సమావేశాన్ని ఆయన గైర్హాజరు కావడంతో దుగ్గి జెడ్పీటీసీ యలమంద అధ్యక్షతన నిర్వహించారు. 1, 4,7వ సమావేశాలకు అధ్యక్షతన వహించిన జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా గ్రామాల్లో పారిశుద్ధ్యం, డ్రైనేజీ వ్యవస్థ, సీజనల్ వ్యాధులు, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, గ్రామీణ నీటి సరఫరా, జల వనరులు, వ్యవసాయం, ఆరోగ్య పరిరక్షణ అంశాలపై ఆయా శాఖల అధికారులతో చర్చించారు. కాకుమానులోని బాలికల వసతి గృహానికి ప్రహరీ లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని, ప్రహరీ నిర్మాణం దిశగా సంబంధిత శాఖ చర్యలు చేపట్టాలని సూచించారు.

ప్రొటోకాల్ ఉల్లంఘనలపై ఫిర్యాదులు

ప్రభుత్వ కార్యక్రమాలకు అధికారులు జెడ్పీటీసీలను ఆహ్వానించడం లేదని ప్రొటోకాల్ ఉల్లంఘిస్తున్నారని పలువురు జెడ్పీటీసీలు సమావేశంలో ఆరోపించారు. అయితే ఇదే సమస్యపై గతంలో జరిగిన సమావేశాల్లోనూ జెడ్పీటీసీలు పదే, పదే ఫిర్యా దులు చేస్తున్నప్పటికీ వివిధ శాఖల అధికారులు పెడచెవిన పెడుతున్న విషయం వెలుగులోకి వచ్చింది. దీనిపై స్పందించిన హెనీ క్రిస్టినా ప్రొటోకాల్ పాటించడంలో నిర్లక్ష్యం తగదని అధికారులకు సూచించారు. అదే విధంగా స్త్రీ–శిశు సంక్షేమంపై 5వ స్థాయీ సంఘం తెనాలి జెడ్పీటీసీ పిల్లి ఉమా ప్రణతి, సాంఘిక సంక్షేమంపై 6వ స్థాయీ సంఘం జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ బత్తుల అనురాధ అధ్యక్షతన నిర్వహించారు. ఆయా సమావేశాల్లో జెడ్పీ సీఈఓ వి.జ్యోతిబసు, డిప్యూటీ సీఈఓ సీహెచ్ కృష్ణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.